క్లుప్తంగా

23న సర్వసభ్య సమావేశం

నడిగూడెం : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై తగు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు గత మూడు నెలలుగా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై నివేదికలను కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి ఉత్తమ్‌ను సన్మానిస్తున్న నాగన్నగౌడ్ తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : నియోజకవర్గంలో లింక్ రోడ్లు, లోలెవల్, హై లెవల్ కాజ్‌వేల నిర్మాణానికి సుమారు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించిన మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలోని చెరువులలో పూడికతీత పనులు చేపట్టాలని రైతులతో కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మత్స్య సొసైటీ అధ్యక్షుడు శీలం శ్రీను, చింతకాయల రాము, మల్లయ్య, వెంకన్న, నర్సయ్య తదితరులు ఉన్నారు.

శ్రీగోదాదేవికి వెండి గాజులు బహూకరణ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగోదాదేవి అమ్మవారికి హుజూర్‌నగర్‌కు చెందిన కర్రె కొండలు–సుభద్ర దంపతులు రూ.12 వేల విలువ గల వెండి గాజులను ఆలయ ప్రధాన అర్చకుడు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులకు అందజేశారు. ఆలయ సిబ్బంది, భక్తులు ఉన్నారు.

గోపయ్య, తిరుపతమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

నడిగూడెం : మండలంలోని వేణుగోపాలపురంలో సోమవారం శ్రీగోపయ్య –తిరుపతమ్మ, అంకమ్మ, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనము, రక్షా బంధనము, దీక్షాధారణ, పంచగవ్య ప్రాసన, రుత్విగ్వరణ, జలాధివాస నీరాజన మంత్రపుష్పము, చతుర్వేదశ్వస్తి, తీర్థప్రసాద వితరణ జరిపారు. నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అనుమతి లేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

మునగాల : మండల కేంద్రంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సామాజిక ఉద్యమకారుడు రాయల కృష్ణ సోమవారం ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు 1 వెంచర్లలో లేఅవుట్ పర్మిషన్, నాలా పర్మిషన్, గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా కొనుగోలుదారులకు ప్లాట్లు విక్రయిస్తున్నారని ఆరోపించారు. మండలంలో రాజకీయ ముసుగులో కొందరి వ్యక్తులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవతారమెత్తి ఈ దందాను కొనసాగిస్తున్నారన్నారు. తాను ఇప్పటికే రెవెన్యూ, పోలీసు శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బీజేపీలో చేరిక



పృథ్వీని బీజేపీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణప్రసాద్

మునగాల : మండలంలోని విజయరాఘవపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కత్తి పృథ్వీ సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్.. పృథ్వీకి కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నడిగూడెం మండల అధ్యక్షుడు దున్న సతీష్, కోదాడ బీజేపీ నాయకులు తోకల మల్సూర్, బండారు శోభారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాసిరకంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు

నడిగూడెం : మండలంలోని బృందావనపురంలో సీసీ రోడ్డు పనులు నాసిరకంగా చేపడుతున్నారని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బెల్లంకొండ నవీన్ ఆరోపించారు. సోమవారం సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. కొలతలు లేకుండా, ఇసుకను ఉపయోగించకుండా రాతి పొడితో రోడ్డు నిర్మిస్తున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- రెండవ యాదగిరిగుట్టగా రేపాలలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రసిద్ధి
- రేపటి నుంచి ఉత్సవాలు
- 24న స్వామివారి కల్యాణ మహోత్సవం



ముస్తాబైన రేపాల శివారులోని గుట్టపై గల లక్ష్మీనరసింహస్వామి ఆలయం

మునగాల : తెలంగాణలో రెండవ యాదగిరిగుట్టగా పేరుగాంచిన మునగాల మండలంలోని రేపాల శివారులో గల గుట్టపై స్వయంభు శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈమేరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. బుధవారం నుంచి పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

24న కల్యాణ మహోత్సవం

20వ తేదీన శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు సిరిపురం నుంచి రాక, 21న అధ్యయనోత్సవం, 22న పరమ పదోత్సవం, 23న ధ్వజారోహణం (గరుడముద్ద), 24న సాయంత్రం ఆరు గంటలకు డోలోత్సవం, అదేరోజు రాత్రి పదిగంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 25న ఉదయం పదిగంటలకు లక్ష్మీతులసి పూజ, రాత్రి ఏడు గంటలకు గరుడోత్సవం, 26న రాత్రి ఏడు గంటలకు రథోత్సవం, 27న చక్రతీర్థం, రాత్రి పూర్ణాహుతి, ధ్వజారోహణం, దోపు, 28న రాత్రి పది గంటలకు గాంధోళి (వసంతోత్సవం), 29న రాత్రి 9 గంటలకు స్వామివారి పవళింపు సేవ, రాత్రి 12గంటలకు 12 సేవల అనంతరం స్వామివారు సిరిపురం వేంచేయుట ఉంటుంది. ఈ బ్రహ్మోత్సవాలలో ఆలయ ప్రధాన అర్చకులుగా చివలూరి రామకృష్ణాచార్యులు, అర్చకస్వాములు చివలూరి విఖనసచార్యులు, చివలూరి సాయికృష్ణమాచార్యులు, కల్యాణోత్సవ వ్యాఖ్యాతగా చివలూరి లక్ష్మీనరసింహచార్యులు నిర్వహిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ సారిక చిన్నరామయ్య తెలిపారు.

అభివృద్ధికి ఆమడదూరంలో ఆలయం

రేపాలలోని శ్రీలక్ష్మీనరసింహుడి ఆలయానికి సంబంధించి దాదాపు 70 ఎకరాల దేవుడి మాన్యం భూమి ఉంది. ఆ భూమిని కొందరు కౌలు చేస్తున్నారు. కానీ కౌలు రైతులు సక్రమంగా కౌలు చెల్లించడం లేదు. దీంతో ఆలయం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. నిధులు లేకపోవడంతో ప్రతియేటా దేవస్థాన కమిటీ దాతలు అందించే విరాళాలతోనే స్వామివారి కల్యాణం, బ్రహ్మోత్సావాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



స్వామివారి కల్యాణం నిర్వహించబోయే మండపం

ఏర్పాట్లు పూర్తి చేశాం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణంతో పాటు బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

– సారిక చినరామయ్య, ఆలయ చైర్మన్, రేపాల

భక్తులు తరలిరావాలి



రేపాల గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మా తాత, ముత్తాతల వారసత్వంతో వచ్చిన అర్చకత్వాన్ని నేను గత 37 ఏళ్లుగా కొనసాగిస్తున్నాను. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి.

– చివలూరి రామకృష్ణాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు, రేపాల

జానకీనగర్‌లో ట్యాంకర్‌తో నీటి సరఫరా



జానకీనగర్‌లో ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

చిలుకూరు : మండలంలోని జానకీనగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ మోటారు మరమ్మతులకు గురికావడంతో తాగునీటికి కటకట ఏర్పడింది. దీంతో సోమవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. దీంతో నీటి కోసం మహిళలు ట్యాంకర్ వద్ద ఎగబడ్డారు. అయితే భూగర్భ జలాలు అడుగంటి ఇప్పటికే సరిగ్గా నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు మోటారు కాలిపోవడంతో ప్రజలు నీటి కష్టాలు తప్పడంలేదు. ముందు తాగునీటి సమస్య తీవ్రం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



ఫ్రెండ్స్ షటిల్ క్లబ్ జెర్సీలు ఆవిష్కరిస్తున్న సీఐ రాము, ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు

కోదాడఅర్బన్ : క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు, పట్టణ సీఐ టిరాము అన్నారు. కోదాడ పట్టణంలోని 22వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ షటిల్ క్లబ్‌ను జిల్లా బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి తోట రంగారావు, వార్డు కౌన్సిలర్ కోట మధులతో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం క్లబ్ జెర్సీలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మెంబర్స్ చందా శ్రీనివాసరావు, లయన్ హనుమంతరాజు, డాక్టర్ రవికుమార్, పల్లా వెంకటేశ్వర్లు, నెల్లూరు సతీష్, మద్దూరి వెంకటరెడ్డి, పోలూరి శ్రీను, చెవుల శ్రీను, రామకృష్ణ, కొల్లు శ్రీను, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని వినతి

మఠంపల్లి : గ్రామ పంచాయతీ సిబ్బందికి సుమారు 6 నుంచి 10 నెలలుగా వేతనాలు నిలిచిపోయాయని, వెంటనే వేతనాలు చెల్లించాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ సంఘం) నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ఎంపీడీఓ జానకిరాములుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సయ్యద్ రన్‌మియా, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, మైసయ్య, గురువారెడ్డి, దేవదానం, సంతోషి, సైదులు, సైదానాయక్, ఏసు, రహీం, చిన్నోడు, వెంకటయ్య, పాండు, శంకర్, బాలు ఉన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు



కోదాడఅర్బన్ : కోదాడలో పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



మునగాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వీవీఎం హైస్కూల్, క్రిష్ణవేణి హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు తెలుగు పరీక్షకు 650 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈఓ సైదానాయక్ తెలిపారు. కాగా పరీక్ష కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ యాకుబ్ పాషా, తహసీల్దార్ నాగార్జునరెడ్డి పరిశీలించారు.

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్షకు 2255 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఆరుగురు గైర్హాజరు అయినట్లు కోదాడ ఎంఈఓ ఎండి సలీం షరీఫ్ తెలిపారు. కాగా పరీక్షా కేంద్రాలను కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ పరిశీలించారు. కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సీఐ టి.రాము శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

చిలుకూరు : పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, గ్లోబస్ పాఠశాలలో మొత్తం 403 మంది విద్యార్థులకు గాను 397 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ సలీమ్ షరీఫ్ తెలిపారు. కాగా, పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎస్‌ఐ రాంబాబు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు.

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.శిరీష పరిశీలించారు. కాగా, తొలిరోజు పరీక్షకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దండు సీతారామరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరేడుచర్ల : పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాలలో 639 మంది పదవ తరగతి విద్యార్థులు సోమవారం పరీక్ష రాయాల్సి ఉండగా ఒక విద్యార్థి మాత్రమే హాజరు కాలేదని మండల విద్యాధికారి చత్రు నాయక్ తెలిపారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి పరీక్షకు 118 మంది విద్యార్థులకు 118 మంది విద్యార్థులు, కేజీబీవీ పాఠశాలలో 90 మంది విద్యార్థులకు 90 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ చత్రునాయక్ తెలిపారు.

మేళ్లచెరువు : పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో మొదటి రోజు తెలుగు పరీక్షకు 690 మంది విద్యార్థులకు గాను 688 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

జగన్మోహిని అవతారంలో శ్రీరామచంద్రమూర్తి

- కనుల పండువగా కొనసాగుతున్న రామాలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు
- విమాన శిఖర కలశాలకు జలాభిషేకం చేసిన ధర్మకర్తలు
- యాగం నిర్వహించిన భక్తులు



శ్రీరామచంద్రమూర్తిని జగన్మోహిని అవతారంలో అలంకరించి పల్లకీలో తీసుకొస్తున్న ధర్మకర్తలు



విమాన శిఖర కలశాలకు జలాధివాసం చేసేందుకు తీసుకెళ్తున్న ధర్మకర్తలు



శ్రీసీతాలక్ష్మణసమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహాలకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు



భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకుల బృందం

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో శ్రీకోదండ రామాలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు ఆద్యంతం భక్తిభావంతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం శ్రీరామచంద్రమూర్తిస్వామి వారు జగన్మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా యాగశాలలో ఏర్పాటు చేసిన 18 హోమ గుండాల వద్ద పలువురు దంపతులు యాగం నిర్వహించారు. అదేవిధంగా యాగశాలలో వేదపండితులు బోలా శంకరుడికి రుద్రాభిషేకం, విశ్వక్సేన పూజ, సుప్రభాతం, ప్రబంధ పారాయణం, వేద పారాయణం, క్షీరాధివాసం వంటి విశేష పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం స్వామికి ఊరేగింపు నిర్వహించారు. మోహిని ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం విమాన శిఖర కలశాలకు ఆలయ ధర్మకర్తలు జలాభిషేకం చేశారు. ఉత్సవ విగ్రహాలకు భక్తులు పెద్దఎత్తున భక్తిశ్రద్ధలతో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ఆలయ పునఃప్రతిష్ఠ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ రాము

కోదాడఅర్బన్ : బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పట్టణ సీఐ టి.రాము పేర్కొన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పక్కన వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్యకరమైన ఆయుర్వేద మూలిక వట్టివేరు నీటి చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాగింగుల అంజన్ గౌడ్, వాసవీ యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఇమ్మిడి అనంత చక్రవర్తి, డాక్టర్ వంగవీటి భరత్ చంద్ర, కోశాధికారి గుడుగుంటల అఖిల్, వోరుగంటి నిఖిల్, గరిణె శ్రీధర్, రాయపూడి వెంకటనారాయణ, వంగవీటి శ్రీనివాసరావు, చల్లా లక్ష్మీనరసయ్య, బండారు శ్రీనివాసరావు, బాదేరాము తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్



టిప్పర్లను సీజ్ చేసిన పోలీసులు

మఠంపల్లి : అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను సోమవారం మఠంపల్లి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుండ్లపల్లి సమీపంలో కృష్ణానది ఒడ్డున మట్టిని అక్రమంగా చైన్ మిషన్‌తో తవ్వి మూడు టిప్పర్లతో తరలిస్తుండటంతో దాడులు చేసి టిప్పర్లను పట్టుకున్నారు. రఘునాథపాలెంకు చెందిన దేవపంగు రవి, మరో ముగ్గురుపై కేసు నమోదు చేసి, మూడు టిప్పర్లను, ఒక చైన్ మిషన్‌ను సీజ్ చేశారు. అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

కొట్టేసిన డబ్బుతో అప్పులు తీర్చేశాడు

- పోలీసుల అదుపులో నిందితుడు?

కోదాడ: పోలీసు శాఖ ఆధ్వర్యంలో కోదాడలో నిర్వహిస్తున్న పెట్రోల్‌బంక్‌లో రూ.12లక్షలను ఇటీవల చోరీ చేసిన బంక్ మేనేజర్ హనుమారెడ్డి.. ఆ డబ్బుతో అప్పులన్నీ తీర్చేసుకున్నట్లు తెలిసింది. చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని విచారించగా ఇదే విషయాన్ని వెల్లడించినట్లు సమాచారం. పోలీసులు వారిని పిలిపించి ఆ డబ్బులు బంక్‌కు సంబంధించినవని వెనక్కి ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

పాలకవీడు : విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందింది. ఈ ఘటన పాలకవీడు మండలంలోని కల్మెటతండాలో చోటు చేసుకుంది. కల్మెటతండాకు చెందిన రూపావత్ లలిత (32) ఇంటి ముందు ఉన్న తీగపై దుస్తులు ఆరేస్తుంది. అప్పటికే ఆ తీగకు కరెంట్ సరఫరా అవుతుండడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మృతురాలికి భర్త,కుమార్తె ఉన్నారు. మృతురాలి భర్త రూపావత్ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీ నర్సయ్య తెలిపారు.

'మైహోం' పన్ను చెల్లింపులపై డీఎల్‌పీఓ విచారణ

మేళ్లచెరువు : మేళ్లచెరువు గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి పన్నులు, మైహోం పరిశ్రమలో పలు కట్టడాలకు సంబంధించిన పన్నుల చెల్లింపులపై సోమవారం డీఎల్‌పీఓ యాదగిరి విచారణ చేపట్టారు. పరిశ్రమ వారు అధికారులను మభ్యపెట్టి పన్నులు ఎగవేస్తున్నారని, అదేవిధంగా పరిశ్రమలో యూనిట్ -4 నిర్మాణానికి గ్రామ పంచాయతీ అనుమతులు ఇవ్వడంపై ఇటీవల స్థానికులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అనంతరం మేళ్లచెరవుఉ గ్రామపంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నాగేంద్రబాబు ఉన్నారు.

కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలి

అనంతగిరి : కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల మహిళా నాయకురాలు గునుకుల స్వరూపరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతినగర్ గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు, మాజీ సర్పంచ్ బద్దం కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీపై, పార్టీ నాయకులపై శనివారం చేసిన వాఖ్యలను ఆమె ఖండించారు. కోదాడ నుంచి ఖమ్మం వరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శాంతినగర్‌లోని సుమారు 70 ఇళ్లను తొలగించారని, ఆ ఇళ్లకు పూర్తిగా నష్టపరిహారం ప్రభుత్వ చెల్లించినప్పటికీ మాజీ సర్పంచ్ తన ఇంటిని మాత్రం కొంత మేర తొలగించకుండా అడ్డుపడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని మఠంపల్లి బైపాస్ రోడ్డులో 11కేవీ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం మఠంపల్లి బైపాస్ రోడ్డులో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నేరేడుచర్ల : రాష్ట్రంలో అన్ని కులాలకు ఏర్పాటు చేసినట్లే రజకులకు కూడా ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రజక సంఘం జిల్లా నాయకుడు చిలకరాజు శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడారు. రజకులు సమాజంలో వెనుకబడ్డారని కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రజక సంఘం నాయకులు కోమట్రాజు వెంకట్, చిలకరాజు సైదులు, వీరయ్య, వినయ్, నాగరాజు, నాగమణి, నాగలక్ష్మి ఉన్నారు.

హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

హుజూర్‌నగర్ : సివిల్ సప్లై గోదాముల్లో హమాలీలుగా పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా కష్టకాలంలో కూడా పౌరసరఫరాల శాఖ ఆదేశాలకు అనుగుణంగా హమాలీ కార్మికుల తమ ప్రాణాలు పణంగా పెట్టి నిత్యావసర సరుకులు సరఫరా చేశారని గుర్తుచేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించేలా అసెంబ్లీలో తీర్మానం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ పెద్దమేస్త్రి బాణోతు సైదులు, చిన్న మేస్త్రి పి.వెంకన్న, కార్మికులు పి.గోపి, బి.రామ్మూర్తి జె.వెంకన్న, వెంకటాద్రి, మల్లయ్య, కోటేశ్వరావు, చక్రాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



చిలుకూరులో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్‌ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు

చిలుకూరు : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం చిలుకూరు గ్రామ వీధుల్లో సీఐఎస్‌ఎఫ్ బలగాలతో కలిసి స్థానిక పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ఒత్తిడి, భయాందోళన లేకుండా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురభి రాంబాబు, స్థానిక పోలీసులు, సీఐఎస్‌ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఆటో ప్రయాణ సౌకర్యం

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో పదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాయడానికి మఠంపల్లికి వెళ్లేందుకు గాను స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాయుడు లక్ష్మయ్య ఉచితంగా ఆటో ఏర్పాటు చేయించారు. సోమవారం ఆటోను ఆయన స్థానికంగా ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ బస్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో విద్యార్థుల కోసం ఆటో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెన్నయ్య, పున్నయ్య, పెద్దభద్రారెడ్డి, కోటి, బ్రహ్మయ్య, రమేష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

హుజూర్‌నగర్‌రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని మండల వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత అన్నారు. సోమవారం మండలంలోని వేపలసింగారంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో 32 మంది రక్త నమూనాలు సేకరించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణి, కార్యదర్శి గిరిజాకుమారి, ఆరోగ్య సిబ్బంది సావిత్రి, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నడిగూడెం పంచాయతీ కార్యదర్శిగా దుర్గాప్రసాద్

నడిగూడెం : నడిగూడెం పంచాయతీ కార్యదర్శిగా దుర్గాప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొద్ది నెలలుగా నడిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి పోస్టు ఖాళీగా ఉన్నది. దీంతోప్రభుత్వం పాలకవీడు మండలంలో పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌ను నడిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయానికి బదిలీ చేసింది.

20న వాహనాల వేలం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పలు కేసులలో సీజ్ చేయబడిన 10 వాహనాలను ఈ నెల 20న స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్.లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈవేలంలో పాల్గొనే వారు అదే రోజు ఉదయం 9 గంటల నుంచి ఎక్సైజ్ స్టేషన్‌లో ముందస్తుగా దరావత్ రుసుము చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

రిక్షా కార్మికులకు దుస్తుల పంపిణీ

మునగాల : మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు లకుమారపు వరప్రసాద్ సతీమణి రత్నమాల ఇటీవల గుండెపోటుతో మృతిచెందింది. ఆమె జ్ఞాపకార్థం సోమవారం వరప్రసాద్, అతని కుమారుడు నాగరాజు మునగాల మండల కేంద్రంలో పలువురు రిక్షా కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.